క్లుప్తంగా

ఇమామ్‌లకు గౌరవ వేతనం తక్షణం విడుదల చేయాలి



పెడన/కోనేరుసెంటర్: రాష్ట్ర వ్యాప్తంగా ఇమామ్, మౌజన్‌ల గౌరవ వేతనాలను తక్షణం కూటమి ప్రభుత్వం విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఖాశీం(అబు) డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ పెడన, మచిలీపట్నం కార్యాలయాల్లో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాశీం మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ స్టేట్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాదర్ బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ హాఫీజ్‌ఖాన్‌ల పిలుపు మేరకు జిల్లాలో పర్యటిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఇమామ్‌లకు నెలకు రూ.10 వేలు, మౌజన్‌లకు నెలకు రూ.5 వేలు గౌరవ వేతనం నిరంతరంగా చెల్లిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదని దుయ్యబెట్టారు. 2025 జనవరి నుంచి చెల్లింపులు చేయడం లేదన్నారు. ఇప్పటి వరకు 11 నెలలుగా వీరికి గౌరవ వేతనాలు విడుదల చేయాల్సి ఉందని, తక్షణం విడుదల చేయాలని కోరారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నికల ప్రకటనకు ముందు 2024 మార్చి వరకు గౌరవ వేతనాలను పూర్తిస్థాయిలో చెల్లించిందని తెలిపారు.

నేటి నిరసనను విజయవంతం చేయాలి

రాష్ట్ర మైనార్టీ నాయకుడు నాజాఫ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అచ్చేబాలు మాట్లాడుతూ.. మచిలీపట్నంలో సోమవారం చేపట్టే నిరసనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మైనార్టీ నాయకులు అబ్దుల్ సలీం, హుమయూత్, నూరీ, ఇబ్రహీం, కరీం, అబ్దుల్ రియాజ్, అబ్దుల్ ఆసీఫ్, అజ్గర్‌అలీ, మొహ్మద్ సాబ్, రబ్బానీ, నయిమ్, మోసిన్, ఇస్మాయిల్, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ప్లకార్డులు చేతబూని నినాదాలు చేస్తూ వేతనాలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



గూడూరు: మండల పరిధిలోని కప్పలదొడ్డికి చెందిన చేనేత కార్మికురాలు మరకా శ్రీలక్ష్మి వైద్య ఖర్చుల కోసం దేవాంగ యూత్ రూ.55 వేల ఆర్థిక సహాయం అందజేసింది. కాలికి ఇన్‌ఫెక్షన్ సోకడంతో కొన్ని నెలలుగా శ్రీలక్ష్మి తీవ్ర ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న దేవాంగ యూత్ రూ.55 వేలు సేకరించారు. ఆదివారం కప్పలదొడ్డిలో స్థానిక పెద్దలు యక్కల నాగరాజు, కట్టా మునేశ్వరరావు, పేరిశెట్టి నాగరవి సమక్షంలో దేవాంగ యూత్ ప్రతినిధులు ఊటుకూరి సుధీర్‌కుమార్, పుచ్చల సుబ్రహ్మణ్యం, బూసం దనపతి, ఉట్ల మల్లిఖార్జున, బట్ట కోట శివకృష్ణ బాధితురాలికి నగదు అందజేశారు.

పూర్తయిన నిమజ్జనోత్సవాలు



మచిలీపట్నంటౌన్: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పందిళ్లలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు నగరంలో ఆదివారం భారీ ఊరేగింపులు నిర్వహించారు. డీజే సౌండ్స్, తీన్మార్ డప్పులు, మేళతాళాల మధ్య ఊరేగింపుగా గణపతిని నిమజ్జనానికి తరలించారు. గణనాథుని వాహనాల ముందు నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాలతో కేరింతలు కొడుతూ ముందుకు సాగారు. చంద్రగ్రహణ గడియలు రాకముందే గణనాథుల విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

మృతుడి కుటుంబానికి సాయం అందజేత



మోపిదేవి: స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యులుగా కొనసాగుతూ నర్రా నారాయణరావు ఇటీవల మృతి చెందారు. మట్టి ఖర్చుల నిమిత్తం సొసైటీ నిధులు రూ.10 వేలు మృతుని కుమారుడికి మోపిదేవిలో వారి ఇంటివద్ద ఆదివారం సొసైటీ చైర్‌పర్సన్ పరుచూరి శ్రీనివాసరావు అందజేశారు. ఆయన వెంట సొసైటీ కార్యదర్శి మోపిదేవి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

438 మందికి వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో ఆదివారం ఉచిత కార్పొరేట్ వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 438 మంది రోగులకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు ఎస్.దాశరథి, లింగంశెట్టి వర్ధన్, సాధారణ వైద్యానికి హోమియో వైద్యురాలు పి.భవాని, మానసిక రుగ్మతలకు హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ హరిహర్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

యూరియా కొరత లేదన్న ప్రచారంపై ఆగ్రహం

- కొరత లేకపోతే ఎకరానికి మూడు కట్టలు ఇవ్వొచ్చుగా..!
- ఐదెకరాలకు ఒక కట్ట ఇస్తున్నారు.. ఏం చేసుకోవాలి
- గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులను నిలదీస్తున్న రైతులు



పెనుమల్లి పీఏసీఎస్ వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

పెడన/గూడూరు/కోడూరు/ఘంటసాల: యూరియా దొరక్క రైతులు అల్లాడుతుంటే.. యూరియా కొరత లేదంటూ అధికార యంత్రాంగం ఇంటింటా ప్రచారం చేయడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ బాలాజీ ఆదేశాలతో పెడన, గూడూరు, కోడూరు, ఘంటసాల మండలాల్లో పంచాయతీరాజ్, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు ఆదివారం యూరియా సమస్యపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం పంటకు సరిపడా యూరియాను అందిస్తోందని, రైతులు యూరియా అధిక మొతాదులో వినియోగం, యూరియాను నిల్వలు చేయడం వల్ల కొరత ఏర్పడుతుందని అధికారులు అన్నదాతలకు చెప్పే ప్రయత్నం చేశారు. దీంతో చాలా గ్రామాల్లో రైతులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కొరత లేకపోతే పీఏసీఎస్‌లు, గ్రోమోర్ కేంద్రాల వద్ద పడిగాపులు పడాల్సిన అవసరం ఏముందని, యూరియాను సరఫరా చేయలేక ఇలా ప్రచారం చేస్తారా అంటూ అధికారులపై మండిపడ్డారు. పొలాల్లో యూరియా జల్లుతున్న రైతుల వద్దకు అధికారులు వెళ్లి, అధిక మోతాదులో యూరియాను వినియోగించ వద్దంటూ చెప్పే ప్రయత్నం చేశారు. 'ఎకరా పంటకు ఎంత యూరియా వినియోగించాలో మాకు తెలియదా.. ఇప్పుడు యూరియా కొరత వచ్చిందని యూరియా వినియోగాన్ని తగ్గించమనడం సిగ్గుచేటని' పలువురు రైతులు బాహాటంగానే మండిపడుతున్నారు.

అధికారుల పర్యటనలు..

యూరియాకు కొరత లేదన్నప్పుడు ఎకరానికి అర కట్ట చొప్పున ఐదెకరాలున్న వారికి రెండున్నర కట్టలు ఎందుకు ఇవ్వడం లేదని, ఒక కట్ట మాత్రమే ఇచ్చి సరిపెట్టుకోవాలని చెప్పడం ఏమిటంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం పెడన మండలంలోని పలు పీఏసీఎస్‌లలోను, గ్రామాల్లో యూరియా కట్టలను పంపిణీ చేశారు. కాకర్లమూడి, పెనుమల్లి, కొంకేపూడి తదితర గ్రామాల్లో యూరియాను రైతులకు అందజేశారు. మరో వైపు మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు గ్రామాలకు వెళ్లి రైతులకు యూరియాపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, ఎంపీడీవో అరుణకుమారి, ఏవో జెన్నీలు తమ సిబ్బందితో కలిసి వెళ్లి యూరియా మళ్లీ వస్తుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నచ్చెజెప్పుతున్నారు. అయితే పలు చోట్ల యూరియా కొరత లేనప్పుడు కనీసం కౌలుకు చేస్తున్న వారికి కూడా కట్ట అందని దుస్థితి ఉందని, అధికారుల దృష్టికి రైతులు సమస్యలు ఏకరవు పెట్టారు. రెండు గ్రామాల్లో మొత్తం నాలుగు లేదా ఐదెకరాలున్న రైతుకు ఒక గ్రామంలో ఉన్న పొలానికి కట్ట యూరియా ఇచ్చి మరోక గ్రామంలో అక్కడ ఇచ్చారని, ఇక్కడ ఇవ్వడం కుదరదని పేర్కొవడం ఏమిటంటూ నిలదీస్తున్నారు. ఇటువంటి పరిస్థితి ఎప్పుడు లేదని ధ్వజమెత్తారు. అదనుగా ఉన్న సమయంలో దుబ్బు చేయడానికి యూరియా వాడతామని, దుబ్బు చేసిన తరువాత ఇతర ఎరువులు కొట్టినా ఫలితం ఉంటుందని, దుబ్బు చేయకుండా ఇతర ఎరువులు వాడినా ఉపయోగం లేదని రైతులు వాపోతున్నారు.



జరుగువానిపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇంత దారుణమైన దుస్థితి ఎప్పుడూ లేదు



నానో యూరియా వాడాలని అధికారులు సూచించడంతో దానిని తీసుకువచ్చి వాడా.. అంతగా ఫలితం కనిపించలేదు. దుబ్బు చేయలేదు. దీంతో యూరియానే మంచిదని, యూరియా కట్టలు కోసం తిరుగుతున్నా. సొంతంగా నాలుగు ఎకరాలుంది. కౌలుకు 15 ఎకరాల వరకు సాగు చేస్తున్నా. సొంతంగా చేసే పొలాలకు కూడా అరకట్ట చొప్పున రెండు కట్టలు ఇవ్వాలి. కాని కట్ట మాత్రమే ఇస్తున్నారు. మిగిలిన కౌలుకు చేసే పొలం పరిస్థితి ఏమిటి. ఇంత దారుణమైన దుస్థితి ఎప్పుడూ లేదు.

– ఉసా శ్రీహరి, రైతు, నేలకొండపల్లి, పెడన మండలం

కొరత ఉండబట్టే అరకొరగా ఇస్తున్నారు



అదను దాటిన తరువాత యూరియా ఇస్తామన్నా ఫలితం ఉండదు. అదను దాటిన తరువాత చల్లినా దుబ్బు చేయదు. కొరత లేదంటూనే కట్ట మించి ఇవ్వడం లేదు. నాలుగైదు ఎకరాలు చేసుకునే రైతుకు రెండు కట్టలు ఏం సరిపోతాయి. ఒక రైతుకు పెనుమల్లిలో రెండు ఎకరాలు, నేలకొండపల్లిలో మూడు ఎకరాలుంటే ఆ రైతుకు ఒక గ్రామంలోనే యూరియా కట్ట ఇస్తున్నారు. కొరత లేకపోతే ఇటువంటి ప్రశ్నలు ఎందుకు ఉత్పన్నమవుతాయి. కొరత ఉండబట్టే అరకొరగా ఇస్తున్నారు.

– గాజుల శ్రీరామ్‌బాబు, రైతు, నేలకొండపల్లి, పెడన మండలం

22న ధర్నా జయప్రదం చేయాలి



మోపిదేవి: కౌలు చట్టంలో మార్పు తీసుకురావాలని, భూ యజమానితో సంబంధం లేకుండా రుణాలు అందించాలని కోరుతూ ఈ నెల 22వ తేదీ విజయవాడలో నిర్వహించే ధర్నాకు పెద్ద సంఖ్యలో కౌలు రైతులు తరలిరావాలని రైతుం సంఘం మండల కార్యదర్శి మరీదు సురేష్‌బాబు కోరారు. మండల కేంద్రం మోపిదేవిలో కౌలు రైతుల సమావేశం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. కౌలు రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కౌలు సంఘం నాయకులు కర్రా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బెజవాడ నాగేశ్వరరావు, మద్దాల వెంకటేశ్వరరావు, సింధు ఏడుకొండలు, కొమ్ము జయరావు, తాతా వెంకటేశ్వరరావు, పల్లపాటి వడ్డీ కాసులు, బొంతు దయాకర్, రైతులు పాల్గొన్నారు.

తాటాకు ఇల్లు దగ్ధం

పెడన: పట్టణంలోని 22వ వార్డు బ్రహ్మపురానికి చెందిన తాడిశెట్టి సత్యనారాయణ నివాసం ఉంటున్న తాటాకు ఇల్లు ఆదివారం వేకువజామున అగ్నికి ఆహుతైంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు ఒంటరిగా జీవిస్తున్న సత్యనారాయణ శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడని, ప్రమాదవశాత్తు ఇంటికి నిప్పు అంటుకోవడంతో ఇల్లు కాలిపోయిందన్నారు. ఆదివారం ఉదయం ఆయన ఇంటికి వచ్చిచూసుకునే సరికి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. రూ.60 వేలు ఆస్తి నష్టం జరిగిందని అధికారుల అంచనా వేశారు.

రేపటి అన్నదాత పోరు విజయవంతం చేయాలి



పెడనలో అన్నదాత పోరు వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉప్పాల రాము, నాయకులు



అవనిగడ్డలో పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి, నాయకులు

పెడన: కూటమి ప్రభుత్వంలో అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9న తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. రాము మాట్లాడుతూ.. నిన్న మొన్నటి వరకు రైతులకు సకాలంలో సాగునీరందక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వచ్చిందన్నారు. కొరత లేదంటూనే అరకొరగా యూరియా కట్టలు ఇవ్వడం చాలా దారుణమని వ్యాఖ్యానించారు. ఇందుకు నిరసనగా రైతుల పక్షాన పోరాటానికి వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 9న అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు పెడన నియోజకవర్గంలోని రైతులు, వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. పెడన కార్యాలయం నుంచి శాంతిర్యాలీగా మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. పార్టీ నాయకులు రాజులపాటి అచ్యుతరావు, పిచ్చుక సతీష్‌బాబు, మెట్ల గోపీప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు పోరుకు పెద్ద ఎత్తున తరలిరావాలి

అవనిగడ్డ: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఈనెల 9వ తేదీన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రైతు పోరు కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే, రైతు విభాగం జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాద్రి రమేష్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం రైతు పోరు పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా కూడా సక్రమంగా అందించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ఒక కట్ట యూరియా కోసం రైతులు పనులన్నీ మానుకుని గంటల తరబడి పడిగాపులు పడాల్సి వస్తుందని, రైతులు క్యూలైన్లలో ఉన్న ఫొటోలు, వీడియోలు స్పష్టంగా ఉన్నా మా పార్టీ అసత్య ప్రచారం చేస్తుందని పాలకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి మద్దతు చానల్స్‌లో యూరియా ఇబ్బందులపై వార్తలు వస్తున్నాయని వీటికి ఏమి సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సింహాద్రి పిలుపునిచ్చారు.

సింహాద్రికి పలువురు నేతలు అభినందనలు

వైఎస్సార్ సీపీ రైతు విభాగం కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఎన్టీఆర్, జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన సింహాద్రి రమేష్‌బాబును పలువురు నాయకులు అభినందించారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల జయగోపాల్, బూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు మద్ది చిన్నా, మాజీ సర్పంచ్ పృథ్వీరాజ్, పార్టీ నాయకులు ఆయనను కలిసి అభినందించారు.

చంద్ర గ్రహణంతో ఆలయాలు మూసివేత



కోడూరు: చంద్ర గ్రహణం సందర్భంగా మండలంలోని ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయాల ప్రధాన ద్వారాలకు అర్చకులు తాళాలు వేశారు. కోడూరు గంగాభవానీ, కనకదుర్గమ్మ, విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ, లింగారెడ్డిపాలెం గోకర్ణేశ్వరస్వామి, కోడూరు కల్యాణ వెంకటేశ్వరస్వామివారి ఆలయాలను మూసివేశారు. గ్రహణం అనంతరం సోమవారం ఉదయం ఆలయాలను తెరిచి సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామని అర్చకులు తెలిపారు.

కృత్తివెన్నులో..

కృత్తివెన్ను: చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని ఆలయాలను ఆదివారం సాయంత్రం నుంచి మూసివేశారు. కృత్తివెన్ను శివాలయం సోమవారం ఉదయం 10 గంటలకు తెరిచి ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతి ఇవ్వనున్నట్లు అర్చకుడు మురళీ కృష్ణశర్మ తెలిపారు.

ఘంటసాలలో మూసివేత

ఘంటసాల: చంద్రగ్రహణం సందర్భంగా ఘంటసాల మండలంలోని పలు దేవాలయాలు ఆదివారం మూతపడ్డాయి. ఘంటసాల గ్రామంలోని శ్రీ బాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామి దేవాలయాన్ని అర్చకుడు చావలి కృష్ణ కిషోర్ పర్యవేక్షణలో మూసివేశారు. సోమవారం ఉదయం 7 గంటలకు ఆలయ సంప్రోక్షణ అనంతరం ఉదయం 9.30 గంటల నుంచి స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు. అలాగే గ్రామంలోని శ్రీ బావనారుషి ఆలయం, శ్రీకృష్ణ దేవాలయం, శ్రీ పెన్నేరమ్మ అమ్మవారి ఆలయం, తదితర ఆలయాలను మూసివేశారు.

యూరియా పంపిణీ పరిశీలన



కె. కొత్తపాలెం సొసైటీలో రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీద్ జహీర్

పెదప్రోలు(మోపిదేవి): యూరియా కొరతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రైతులకు సొసైటీల ద్వారా అందజేస్తున్న యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ట్రెనింగ్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీద్ జహీన్ ఆదివారం పరిశీలించారు. మండలంలోని పెదప్రోలు, కె.కొత్తపాలెం పీఏసీఎస్ కేంద్రాలల్లో రైతులకు పంపిణీ చేస్తున్న యూరియా కట్టలు పరిశీలించి, రికార్డులు తనిఖీలు చేశారు. సొసైటీ చైర్‌పర్సన్లు నాదెళ్ల శరత్‌చంద్రబాబు, పూషడపు రత్నగోపాల్, సొసైటీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల షాపులకు స్టాకు ఇవ్వడంపై నిలదీత

చల్లపల్లి: యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పీఏసీఎస్‌కు కాకుండా ప్రైవేటు ఎరువుల దుకాణాలకు యూరియాను పంపిణీ చేయటంపై లక్ష్మీపురం రైతులు తహసీల్దార్ డి.వనజాక్షి నిలదీశారు. లక్ష్మీపురం ప్రధాన సెంటర్‌లోని ప్రైవేటు ఎరువుల దుకాణం వద్ద ఆదివారం సాయంత్రం తహసీల్దార్ టోకెన్లు పంపిణీ చేశారు. ఇక నుంచి సొసైటీ ద్వారానే యూరియా పంపిణీ చేయాలని రైతులు కోరారు. సొసైటీకి యూరియా ఎందుకు పంపలేదో సొసైటీ వారినే అడగాలని తహసీల్దార్ వనజాక్షి సమాధానమిచ్చారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ

చిట్టూర్పు(ఘంటసాల): యూరియా కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వ యంత్రాంగం ఎట్టకేలకు రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ చేపట్టింది. మండలంలో యూరియా అరకొరగా రావడంతో పాటు వచ్చిన యూరియా రైతులు తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో జిల్లా కలెక్టర్ పీఏసీఏస్‌లు, గ్రోమోర్ కేంద్రాల్లో కాకుండా గ్రామాల్లో పంపిణీ చేయాలని ఆదేశాల మేరకు ఘంటసాల మండలం చిట్టూర్పు రైతు సేవా కేంద్రం ద్వారా ఆదివారం రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొడాలి పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుత్తికొండ ప్రసాద్, మొవ్వ ఏడీఏ శ్యామల, డెప్యూటీ ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, వీఆర్వో పి.శ్రీనివాస్, వీఏఏ తేజలు యూరియా పంపిణీ ప్రారంభించారు. రైతుల వేలిముద్రలు తీసుకుని యూరియా పంపిణీ చేశారు.

రైతులకు అవసరమైనంత యూరియా అందిస్తాం



ఆకులమన్నాడు పీఏసీఎస్‌లో మాట్లాడుతున్న రాజశేఖర్, కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ

గూడూరు: జిల్లాలో రైతులకు అవసరమైనంత యూరియా సరఫరా చేస్తామని, రైతులలెవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. ఆదివారం కృష్ణాజిల్లా పామర్రు మండలం జుర్రువరం, గూడూరు మండలం ఆకులమన్నాడు గ్రామాల్లో కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మలతో కలసి రాజశేఖర్ యూరియా పరిస్థితిపై క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో రైతులతో రాజశేఖర్ ముఖాముఖీ మాట్లాడారు. ఎకరాకు 3–4 కట్టల యూరియా అవసరమని రైతులు తెలిపారు. దీనిపై స్పందించిన ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ శాస్త్రీయంగా ఎకరాకు 2 కట్టల యూరియా సరిపోతుందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేసి, ఎరువుల రహిత సేద్యం చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.పద్మావతి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మురళి కిషోర్, ఉయ్యూరు ఆర్డీఓ బి.ఎస్.హేలాషారోన్, డీఎల్‌డీఓ రాజేష్, వ్యవసాయ శాఖ ఏడీ మణిధర్, స్వర్ణలత, ఏఓ శివనాగరాణి, వీఏఏలు షబానా, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ నెల సంబరం

పెడన: మండల పరిధిలోని కూడూరు గ్రామంలో నూతన ఆలయంలో ప్రతిష్ఠించిన గంగానమ్మ అమ్మవారి నెల సంబరాన్ని ఆదివారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపాన్ని గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు దారిపొడవునా అమ్మవారికి పసుపు, కుంకుమలు జల్లి నేలపై నీరు పోసి కొబ్బరికాయలు కొట్టారు. అమ్మవారు తమను చల్లగా చూడాలని ఆకాంక్షించారు.

ఈ - పంట నమోదు అంతంతే

- మళ్లీ బదిలీలుంటాయనే సంకేతాలతో ముందుకు అడుగులు వేయని వీఏఏలు
- నిత్యం దూర ప్రాంతాల నుంచి రాకపోకలతో తీవ్ర జాప్యం
- మరోవైపు ఈ -పంట తప్పనిసరి అంటున్న అధికారులు
- ఆందోళన చెందుతున్న రైతులు



పెడన మండలం మడకలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న వీఏఏ

పెడన: పెడనలో ఈ–పంట నమోదు అంతంతమాత్రంగా ఉంది. రైతు ఏ రకం విత్తనంతో ఎంత విస్తీర్ణంలో పంట వేశాడు తదితర వివరాలతో పాటు ప్రభుత్వం నుంచి సబ్సిడీ పథకాలు పొందడానికి, రైతు పండించిన పంటను విక్రయించుకోవడానికి ఈ – పంట నమోదు తప్పనిసరి. ఈ -పంట నమోదు గడువు ముగిసే సమయం సమీపిస్తున్నా క్షేత్రస్థాయి సిబ్బంది స్పందించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల వ్యవసాయశాఖ క్షేత్ర స్థాయిలో వీఏఏలను బదిలీ చేసి రెండు, మూడు నెలలవుతుంది. బదిలీలు ప్రక్రియ పూర్తయిన తర్వాత కొందరు వీఏలు కోర్టును ఆశ్రయించడంతో వీరి బదిలీలను నిలుపుదల చేసి తాజాగా కౌన్సిలింగ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వీరి బదిలీలు మళ్లీ ఉంటాయనే ఉద్దేశంతో ప్రస్తుతం బదిలీపై వచ్చిన వీఏఏలు పూర్తి స్థాయిలో విధులు నిర్వహించడం లేదు. ఆయా రైతు సేవా కేంద్రాల్లోను, సచివాలయాల్లో కూడా వీరు తూతూమంత్రంగా హాజరవుతున్నారనే విమర్శలున్నాయి. వీరి పరిస్థితి ఇలా ఉంటే మరో వైపు ఈ -పంట నమోదు చేస్తున్న వారికి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. పెడన మండలంలో బల్లిపర్రు, మడక, శింగరాయపాలెం గ్రామాలకు సంబంధించి ఈ పంట నమోదు కావడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. సంబంధిత వీఏఏలను కలుద్దామంటే అందుబాటులో ఉండటం లేదని రైతులు వాపోతున్నారు.


నెలాఖరు వరకే గడువు

ఈ-పంట నమోదుకు సంబంధించి సెప్టెంబరు నెలాఖరు వరకు మాత్రమే గడువు విధించారు. ప్రస్తుతం వీఏఏలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండటం లేదనే ఫిర్యాదులతో పాటు బదిలీలుంటాయనే సంకేతాలు వెలువడటంతో ఈ – పంట నమోదు గడువును మరికొన్ని రోజులు పెంచుతారనే ఆలోచనల్లో అధికారులున్నారు. పెంచినా, పెంచకపోయినా సక్రమంగా విధులు నిర్వహించాల్సిన వీఏఏలు తమకు ఏమీ పట్టనట్లుగా నడుచుకోవడం పెడన నియోజకవర్గంలో రైతుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

60 వేలకు పైగా ఎకరాల్లో నమోదు చేయాలి

పెడన నియోజకవర్గంలో సుమారు 60వేల ఎకరాలకు పైగా ఈ పంట నమోదు చేయాల్సి ఉంది. సుమారుగా పెడన మండలంలో 21 వేలు ఎకరాలు, గూడూరులో 20 వేలు, బంటుమిల్లిలో 14 వేలు, కృత్తివెన్నులో ఏడువేల ఎకరాలకుపైగా ఈ పంట నమోదు చేయాల్సి ఉంది. ప్రస్తుతం నాలుగు మండలాల్లో నాలుగు అంకెల్లో మాత్రమే ఈ పంట నమోదైంది. పెడనలో 4,685 ఎకరాల్లో మాత్రమే నమోదు చేశారు. మిగిలిన మండలాల్లో కూడా ఇదే పరిస్థితి.

ఈ పంట నమోదు వేగంగా చేయాలని ఆదేశించాం



ఈ పంట నమోదు వేగవంతం చేయాలని వీఏఏలను ఆదేశించాం. వీఏఏలు లేని ప్రాంతాల్లో ఎంపీఈవోలు కొనసాగుతున్నారు. వారు కూడా లేని చోట పక్క సచివాలయాలకు సంబంధించిన వీఏఏలకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించాం. ప్రస్తుతం నమోదు జరుగుతూ ఉంది. సిబ్బంది పూర్తిస్థాయిలో రాకపోవడం అంటూ ఏమీ లేదు. దూరం నుంచి రెగ్యులర్‌గా ఇన్‌టైంకు వస్తున్నారు. రైతుల చిరునామాలు, వారికి ఫోన్ చేసి చెప్పడం, పంట పొలాలు చూసి చేయడంతో జాప్యం అవుతుంది. కొన్ని చోట్ల ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– సజ్జా జెన్నీ, ఏవో, పెడన